జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
ఆదివారం 28 జూన్ 2026 పేజీలు : 12



## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపుపై దృష్టి పెట్టాలి



## నేరడిగొండలో శనివారం వస్తే..

# ఆర్టీసీకి తప్పని తిప్పలు!



మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించే వారాంతపు సంత కారణంగా ప్రధాన రహదారిపై తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. సంత రోజున రహదారికి ఇరువైపులా వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేయడం, కొనుగోలు దారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలిపివేయడంతో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల రాకపోకల కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మైనార్టీ ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం

# ప్రత్యేక ప్రాధాన్యత




మైనార్టీల అభివృద్ధికి రాష్ట్ర ప్ర భుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇ స్తుందని తెలంగాణ రాష్ట్ర మై నార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చై ర్మన్ ఓబైదుల్లా కొత్వాల్ అ న్నారు.ఆదిలాబాద్ పట్టణం లోని బాలాజీనగర్‌లో రూ.20 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మైనార్టీ రెసిడెన్షి యల్ పాఠశాల--కళాశాల (బాలికల) భవనాన్ని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శా ఖ మంత్రి అజారుద్దీన్, ప్రభు త్వ సలహాదారు షబ్బీర్ అలీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్ శనివారం ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

# అక్రమ నిర్మాణం కూల్చివేత

## ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు. తహసీల్దార్ బక్కయ్య



జన్నారం మండల కేంద్రంలోని తహశీల్దార్, ఎంపీడీఓ కార్యాలాయల వెనుక 374 శిఖం భూమి లో దుర్గం లక్ష్మీ అనే మహిళ అక్రమంగా నిర్మించుకున్న నిర్మాణాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఉదయం రెవెన్యూ అధికారులు, పోలీసులు,పంచాయతీ కార్యదర్శి సమక్షంలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు.374 శిఖం భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని కలెక్టర్ కు అందిన ఫిర్యాదు మేరకు ,అట్టి అక్రమ కట్టడాన్ని తొలగించాలని ఆదేశించడంతో ,వాటిని తొలగించారు

# సింగరేణికి రావలసిన 56 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలి

**12వ వేతన కమిటీ (జేబీసీసీఐ--12) ఏర్పాటుకు యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టాలి**

**సంస్థ ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి**

**సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (ఏబీకేఎంఎస్--బీఎంఎస్) కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి. మాధవ నాయక్**





**మంచిర్యాల, 27, జూన్ (ప్రజాజ్యోతి);** రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైన ట్రాన్స్‌కో మరియు జెన్‌కోలు సింగరేణికి చెల్లించాల్సిన సుమారు 56 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (ఏబీకేఎంఎస్--బీఎంఎస్) కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి. మాధవ నాయక్ డిమాండ్ చేశారు. అలాగే 12వ వేతన కమిటీ (జేబీసీసీఐ--12) ఏర్పాటుకు యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టాలని, సంస్థ ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. కొత్తగూడెం ఏరియాలోని వి.కె. వర్క్‌షాప్‌లో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (ఏబీకేఎంఎస్--బీఎంఎస్) ఆధ్వర్యంలో ఏరియా సెక్రటరీ కాసర్ల మోహన్ అధ్యక్షతన కార్మికుల సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి మరియు నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి. మాధవ నాయక్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుంచి రావాల్సిన భారీ బకాయిల ప్రభావం సంస్థ ఆర్థిక పరిస్థితిపై తీవ్రంగా పడే అవకాశం ఉందని అన్నారు. ఈ బకాయిల కారణంగా భవిష్యత్ ఉత్పత్తి లక్ష్యాలు, ఆధునీకీకరణ కార్యక్రమాలు మరియు కార్మికుల భద్రతపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందన్నారు. గనుల్లో వినియోగిస్తున్న యంత్రాలు, పరికరాల మరమ్మతులు, ఆధునిక సాంకేతిక పరికరాల కొనుగోలు వంటి కీలక కార్యక్రమాలు నిధుల కొరతతో ప్రభావితమవుతున్నాయని తెలిపారు. సింగరేణి భవిష్యత్తుపై కార్మికుల్లో నెలకొన్న అనిశ్చితిని తొలగించేందుకు యాజమాన్యం వెంటనే సంస్థ ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా చాలా కాలంగా నిలిపివేయబడిన కార్పొరేట్ మెడికల్ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. గుర్తింపు పొందిన సంఘాల నిర్లక్ష్య ధోరణి కారణంగా కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని విమర్శించారు. మెడికల్ బోర్డు నిర్వహణ నిలిచిపోవడం కార్మికుల సంక్షేమానికి పెద్ద దెబ్బగా మారిందన్నారు. మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా కార్మికుల వారసులకు ఉద్యోగాలు కల్పించే ప్రక్రియను రాజకీయ ప్రయోజనాలకు వేదికగా మార్చడం సరికాదన్నారు. కొత్త ఉద్యోగాలు ఇప్పిస్తున్నామని భ్రమలు కల్పిస్తూ, సింగరేణి నిధులతో సమావేశాలు నిర్వహించడం సంస్థపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నదని విమర్శించారు. యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ జి.వి. కృష్ణారెడ్డి మాట్లాడుతూ, 12వ వేతన కమిటీ (జేబీసీసీఐ--12) ఏర్పాటుకు ఏబీకేఎంఎస్--బీఎంఎస్ దేశవ్యాప్తంగా కార్మికులను చైతన్యపరుస్తూ వివిధ ఉద్యమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. కోల్ ఇండియా మరియు సింగరేణి యాజమాన్యాలు వెంటనే బొగ్గు మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపించి జేబీసీసీఐ--12 ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. గత 11వ వేతన సవరణలో కార్మికులకు 19 శాతం 1 శాతం కలిపి మొత్తం 20 శాతం కనీస వేతన పెరుగుదల సాధించడంలో బీఎంఎస్ కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. కార్మికుల హక్కులు, సంక్షేమం మరియు ఉద్యోగ భద్రతే తమ సంఘం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టి.ఎస్. పవన్ కుమార్, జి.వి. కృష్ణారెడ్డి, బి. రామ్‌సింగ్, మొగిలిపాక రవి, కాసర్ల మోహన్, కోటేశ్వరరావు, అలీ ప్రకాష్, ఇనుపనూరి నాగేశ్వరరావు, రఘు, సురేష్ తదితర నాయకులు మరియు వి.కె. వర్క్‌షాప్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణం కూల్చివేత

**ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు. తహసీల్దార్ బక్కయ్య**



**జన్నారం,జూన్27(ప్రజాజ్యోతి)**జన్నారం మండల కేంద్రంలోని తహశీల్దార్, ఎంపీడీఓ కార్యాలాయల వెనుక 374 శిఖం భూమి లో దుర్గం లక్ష్మీ అనే మహిళ అక్రమంగా నిర్మించుకున్న నిర్మాణాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఉదయం రెవెన్యూ అధికారులు, పోలీసులు,పంచాయతీ కార్యదర్శి సమక్షంలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు.374 శిఖం భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని కలెక్టర్ కు అందిన ఫిర్యాదు మేరకు ,అట్టి అక్రమ కట్టడాన్ని తొలగించాలని ఆదేశించడంతో ,వాటిని తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బక్కయ్య మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన,అక్రమ నిర్మాణాలు చేపట్టిన అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా అట్టి భూమిని సర్వే చేయించి ఇంకా ఎవరైనా అక్రమ నిర్మాణాలు ఉంటే వాటిని కూడ తొలగిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో గిర్దావర్ వెంకటేశం,ఎస్.ఐ ఉదయ్ కిరణ్, పంచాయతీ కార్యదర్శి రాహుల్ గుప్త, రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## సిబ్బంది ఆరోగ్యమే సేవలకు బలం: డీఆర్‌డీఓ బానోత్ దత్తారావు



**ఆసిఫాబాద్,జూన్ 27 ప్రజా జ్యోతి** సిబ్బంది సంక్షేమమే తొలి ప్రాధాన్యమని, ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలమని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బానోత్ దత్తారావు పేర్కొన్నారు. శనివారం వెలుగు ఆసిఫాబాద్ మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎస్ఈఆర్పీ, ఈజీఎస్ సిబ్బంది కోసం యశోద హాస్పిటల్స్, మలక్‌పేట్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. వైద్యులు నిర్వహిస్తున్న బీపీ, షుగర్, జనరల్ హెల్త్ చెకప్‌లను పరిశీలించి సిబ్బందితో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి అన్ని మండలాల్లో ఇలాంటి ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని, బీపీ, షుగర్‌తో బాధపడుతున్న సిబ్బందికి ప్రత్యేక ఫాలోఅప్ రిజిస్టర్ నిర్వహిస్తూ ప్రతి నెలా ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు. హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లపై ఎరిక్సన్ టీపీఏ ద్వారా ప్రతి నెలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పకడ్బందీగా అమలు చేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, 27, జూన్ (ప్రజాజ్యోతి);** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల 37, 51, 40 డివిజన్ లలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను మండల తహసిల్దార్ రఫతుల్లా, అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు అందిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. జూలై 24వ తేదీ వరకు నిర్వహించే సమగ్ర సవరణ ఇంటింటి కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని, ఈ క్రమంలో బూత్ స్థాయి అధికారులు ఓటర్ల వద్దకు వెళ్లిన సమయం లో ఎన్యుమరేషన్ ఫారం అందించినప్పుడు బి ఎల్ ఓ యాప్ లో మార్క్ చేయాలని తెలిపారు. సదరు ఓటరు ఎన్యుమరే షన్ ఫారం నింపిన తరువాత తిరిగి సేకరించి యాప్ లో వివరా లు నమోదు చేయాలని తెలిపారు. మరణించిన వారు, గ్రామం వదిలి వెళ్లిన వారు, 2 అంతకు మించి ఎపిక్ కార్డులు కలిగి ఉండడం అంశా లపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఒకరికి ఒక ఓటరు గుర్తింపు కార్డు మాత్రమే ఉండేలా స్పష్టమైన జాబితా రూపొందించాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలు నింపిన తరువాత తిరిగి సేకరించి బి ఎల్ ఓ యాప్ లో ఎలాంటి పొర పాట్లు లేకుండా వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని, ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల పరిరక్షణకు దేశవ్యాప్త పోరాటాలు ఉధృతం చేయాలి



ఐఎన్‌టీయూసీ వర్కింగ్ కమిటీ సమావేశం




**మంచిర్యాల, 27, జూన్ (ప్రజాజ్యోతి);** కర్ణాటక రాష్ట్రంలో నిర్వహించిన ఐఎన్‌టీయూసీ 316వ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశంలో దేశంలోని కార్మిక సమస్యలు, ట్రేడ్ యూనియన్ ఉద్యమ భవిష్యత్ కార్యాచరణ, కేంద్ర ప్రభుత్వ కార్మిక విధానాలపై విస్తృత చర్చ జరిగింది. సమావేశంలో కార్మిక హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు డా. జి. సంజీవ రెడ్డి, ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి డా. బి. జనక్ ప్రసాద్, కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బీకే హరిప్రసాద్‌తో పాటు పలువురు జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో దేశంలోని ప్రస్తుత కార్మిక పరిస్థితులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ట్రేడ్ యూనియన్ ఉద్యమ భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్యంగా ఎదుర్కోవాలని తీర్మానించారు. కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను "నల్ల చట్టాలు"గా పేర్కొంటూ, వాటిని పూర్తిగా రద్దు చేసే వరకు దేశవ్యాప్తంగా పోరాటాలను ఉధృతం చేయాలని నిర్ణయించారు. అదేవిధంగా అసంఘటిత రంగ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, ప్రభుత్వ రంగ ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. సామాజిక భద్రత, కనీస వేతనాల అమలు, ఉద్యోగ భద్రత వంటి అంశాలపై అన్ని రాష్ట్రాల్లో ఉద్యమాలను బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా ఐఎన్‌టీయూసీ 316వ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశంలో భాగంగా ఇండియన్ నేషనల్ మైనింగ్ ఫెడరేషన్ అధ్యక్షులు కుమార్ జయమంగళ్ (అనూప్ సింగ్) ను తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి ఛైర్మన్, ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి డా. జనక్ ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్మిక సంక్షేమం, మైనింగ్ రంగ సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లాకు చెందిన ఐఎన్‌టీయూసీ నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి తదితరులు కూడా పాల్గొన్నారు.

# అడ్డా కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు అవసరం

## హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్



**మంచిర్యాల, 27, జూన్ (ప్రజాజ్యోతి);** జిల్లాలో వేలాది మంది అడ్డా కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు లేబర్ కార్డులు లేకుండా పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరమవుతున్నారని, వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ కోరారు. మంచిర్యాల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ దుర్గం క్రాంతి కుమార్‌ను హెచ్ఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపర్తి సాయి కృష్ణతో కలిసి ఆయన కలుసుకుని అడ్డా కార్మికులు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై శనివారం సమగ్ర వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు, దినసరి కూలీలు లేబర్ కార్డులు లేకుండానే పనిచేస్తున్నారని, ప్రమాదాలు జరిగిన సమయంలో బీమా, ఆర్థిక సహాయం, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందక వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అడ్డా కార్మికులందరికీ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి లేబర్ కార్డుల నమోదు చేపట్టాలని, లేబర్ కార్డు లేని కార్మికులను పనుల్లోకి తీసుకోకుండా మేస్త్రీలు, కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే లేబర్ కార్డుల వల్ల కలిగే ప్రయోజనాలపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. మంచిర్యాల పట్టణంలో అడ్డా కార్మికుల కోసం ప్రత్యేక స్థలం కేటాయించి షెడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. జీహెచ్ఎంసీ పరిధిలో అమలవుతున్న విధంగా రూ.5కే మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లాలో కూడా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా షాపింగ్ మాల్స్, హోటల్స్, షోరూమ్‌లు మరియు ఇతర సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం పని వేళలు అమలు చేయడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, కనీస వేతనాలు తదితర చట్టబద్ధ హక్కులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ దుర్గం క్రాంతి కుమార్ కార్మికుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి చట్టప్రకారం అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# ఆక్రమిత అటవీ భూమిని స్వాధీనం చేసుకున్న అధికారులు.




**జన్నారం,జూన్27(ప్రజాజ్యోతి)**అటవీశాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు జన్నారం డివిజన్ ఇంధనపెల్లి రేంజ్ పరిధిలోని కలమడుగు బీట్ లో మురిమడుగు గ్రామాన్ని ఆనుకొని ఉన్న ఆక్రమిత అటవీ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు జన్నారం, ఇంధనపెల్లి ఎఫ్.ఆర్.ఓ లు వికాస్, లక్ష్మీ నారాయణ లు తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ లు వికాస్, లక్ష్మీనారాయణ లు మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న అటవీ భూమికి చుట్టూ ట్రెంచ్ తవ్వించి అటవీశాఖ ఆధీనంలోకి తీసుకోవడం జరిగిందని స్వాధీనం చేసుకున్న అట్టి భూమి విలువ రూపాయలు 1.5 కోట్లు ఉంటుందని తెలిపారు. అడవి శాఖ భూములలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన స్వాధీనం చేసుకున్న అక్రమ కలప రవాణా చేసిన అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోబడును హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జన్నారం, ఇంధన పెల్లి, తాళ్ల పేట రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు

# ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల రాజ్యాధికారమే లక్ష్యం

**భువనగిరి సభకు తరలిరావాలని పిలుపు**

**మంచిర్యాలలో 'రాజ్యాధికార సమరభేరి' పోస్టర్ ఆవిష్కరణ**



**మంచిర్యాల, 27, జూన్ (ప్రజాజ్యోతి);** జూలై 5న భువనగిరిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి" బహిరంగ సభను విజయవంతం చేయాలని, బహుజన వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని టీఆర్‌పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ కొమ్ముల ప్రవీణ్ రాజ్ పిలుపు నిచ్చారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం జిల్లా కన్వీనర్ అల్లి సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాంటెంకి, కో-కన్వీనర్ రంజిత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో "రాజ్యాధికార సమరభేరి" సభ పోస్టర్లను కొమ్ముల ప్రవీణ్ రాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "దశాబ్దాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు కేవలం ఓటు బ్యాంకులు గానే మిగిలిపోయారు. వారి జీవితాల్లో నిజమైన మార్పు రావాలంటే రాజ్యాధికారం దక్కాలి. బహుజనుల రాజ్యాధికార సాధనే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ సమరభేరి సభ అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే చారిత్రాత్మక ఘట్టం కానుంది" అని అన్నారు. సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత కోసం నిర్వహిస్తున్న ఈ సభకు మంచిర్యాల జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, బహుజన ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. రాష్ట్ర పాలనలో సామాజిక న్యాయం సాధించాలంటే బహుజనులంతా ఏకమవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రంజిత్, రవీంద్ర, మహేష్ వర్మ, దినకర్, శివ, రవీందర్, రూప, దిలీప్, లతీఫ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నెట్‌వర్క్ సమస్యతో గ్యాస్ పంపిణీకి బ్రేక్

## గంటల తరబడి వినియోగదారుల నిరీక్షణ..

### కనీస సౌకర్యాలు లేక అవస్థలు



**ఆసిఫాబాద్ జూన్ 27 (ప్రజా జ్యోతి)** వాంకిడి మండల కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ పంపిణీ కేంద్రంలో శనివారం నెట్‌వర్క్ సమస్యల కారణంగా గ్యాస్ పంపిణీ ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది. దీంతో గ్యాస్ సిలిండర్ల కోసం వచ్చిన మహిళలు, వృద్ధులు, రైతులు సహా వివిధ గ్రామాల వినియోగదారులు గంటల తరబడి కేంద్రం వద్ద వేచి ఉండాల్సి వచ్చింది. వినియోగదారుల కథనం ప్రకారం.. గ్యాస్ బుకింగ్ సమయంలో ఓటీపీలు వచ్చినప్పటికీ డిజిటల్ చెల్లింపులు పూర్తికాకపోవడంతో ఒక్కో వినియోగదారుడి పని పూర్తయ్యేందుకు ఎక్కువ సమయం పడుతోంది. దీంతో ఉదయం వచ్చినవారు సాయంత్రం వరకు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. సమస్య నెట్‌వర్క్‌లో ఉందా, కంప్యూటర్ లేదా బయోమెట్రిక్ పరికరాల్లో ఉందా అనే విషయంపై సిబ్బంది స్పష్టత ఇవ్వడం లేదని వారు తెలిపారు. కేంద్రం వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు వేచి ఉన్నప్పటికీ లోపలికి అనుమతించకుండా బయటే నిలబెట్టారని, "నెట్‌వర్క్ సమస్య ఉంది.. పిలిచినప్పుడు మాత్రమే లోపలికి రండి" అంటూ సిబ్బంది వ్యవహరించారని వినియోగదారులు ఆరోపించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం లేదని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రంలో కూర్చునేందుకు కుర్చీలు, తాగునీటి సౌకర్యం, నీడ వంటి కనీస మౌలిక వసతులు కూడా లేక మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం పత్తి సాగు పనులు కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనులను వదిలి రోజంతా గ్యాస్ కోసం వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ పంపిణీ కేంద్రంలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు టోకెన్ విధానం, తాగునీరు, కూర్చునే సౌకర్యం, సరైన క్యూ నిర్వహణ వంటి వసతులు కల్పించాలని వినియోగదారులు కోరుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సేవలను మెరుగుపరిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# మతసామరస్యానికి ప్రతీక మొహర్రం 'పీర్ల పండుగ'



**నేరడిగొండ జూన్ 27 (ప్రజాజ్యోతి) ::** మొహర్రం పండుగ కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి జరుపుకునే పండుగ అని, ఇది భారతదేశంలోని మత సామరస్యానికి సజీవ ప్రతీక అని కుమారి గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న, ఉప సర్పంచ్ ఆడెపు రవి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం కుమారి గ్రామంలోని ప్రసిద్ధ 'హస్సేన్ హుసేన్' దేవస్థానాన్ని మొహర్రం పండుగ సందర్భంగా గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ మాట్లాడుతూ... ఈ ఏడాది వానలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, జిల్లా ప్రజలంతా సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ భగవంతుడిని వేడుకున్నట్లు తెలిపారు. గ్రామంలో మొహర్రం వేడుకలను ఎంతో వైభవంగా, భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో నిర్వహిస్తున్న హస్సేన్ హుస్సేన్ ఆలయ కమిటీ సభ్యులను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# దేవుల్ నాయక్ తాండాలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటన



**నేరడిగొండ, జూన్ 27 (ప్రజాజ్యోతి):** నేరడిగొండ మండలంలోని రోల్ మామడ గ్రామ పంచాయతీ పరిధిలోని దేవుల్ నాయక్ తాండాలో బోథ్ ఎమ్మెల్యే డా. అనిల్ జాదవ్ శనివారం పర్యటించారు. తాండా ఆడపడుచుల ఆహ్వానం మేరకు గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు, మహిళలు మంగళహారతులు, సాంప్రదాయ నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. తాండాలో నెలకొన్న సమస్యలను స్వయంగా పరిశీలించానని, వాటన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇండ్లు మంజూరు చేస్తానని, తాండాకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తానని స్పష్టం చేశారు. గ్రామస్తుల కోరిక మేరకు త్వరలోనే కమిటీ హాల్ మంజూరు చేస్తానని ప్రకటించారు. ప్రజలందరూ ఐక్యమత్యంతో ఉంటేనే గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని, తనకు ఓ అన్నలాగా తాండా ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ ఏ సహకారం కావాలన్నా అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాథోడ్ సజన్, నేరడిగొండ సర్పంచ్ రవీందర్ రెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డి, సర్పంచ్ శంకర్, ఉప సర్పంచ్ నాగేందర్, నేరడిగొండ ఉప సర్పంచ్ గులాబ్, మాజీ సర్పంచ్ గులాబ్, సాబ్లే సంతోష్, నాయక్ మాన్ సింగ్, కరోబారి గణపత్, యాదవ్ రావ్ మరియు తాండా ప్రజలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ట్రైనింగ్ ఇన్స్టిట్యూషన్ ను ప్రారంభించిన ఎస్సై.



**జన్నారం, జూన్27 (ప్రజాజ్యోతి)** జన్నారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సాయి ట్రైనింగ్ ఇన్స్టిట్యూషన్ ను ఎస్.ఐ గుర్రం ఉదయ్ కిరణ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై ఉదయ్ కిరణ్ మాట్లాడుతు జన్నారం మండల కేంద్రంతో పాటు మండలంలోని విద్యార్థిని, విద్యార్థులు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మంచి శిక్షణ పొంది నైపుణ్యత సాధించాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ యజమాని ఆడెపు లక్ష్మీనారాయణ, ఆడేపు సాయి కిరణ్, పొనకల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, అప్పాల జలపతి తదితరులు పాల్గొన్నారు

## అర్హత కలిగిన దివ్యాంగులకు మాత్రమే సదరం ధ్రువపత్రాలు జారీ చేయాలి

**పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్, సెర్ప్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి దివ్య దేవరాజన్**



**మంచిర్యాల, 27, జూన్ (ప్రజాజ్యోతి);** సదరం యూ డీ ఐ డీ శిబిరాల నిర్వహణలో అర్హత కలిగిన దివ్యాంగులకు మాత్రమే ధ్రువపత్రాలు జారీ చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్, సెర్ప్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి దివ్య దేవరాజన్ అన్నారు. శనివారం వీడియో సమావేశం ద్వారా సదరం శిబిరాల నిర్వహణ, యూ డీ ఐ డీ పోర్టల్ పార్ట్--బి వివరాల నమోదు, హాజరు నమోదు, దివ్యాంగుల హాజరు, పోర్టల్‌లో వేచి జాబితాలో ఉన్న వారికి వైద్య శిబిరాల అంచనా షెడ్యూల్ కేటాయింపు అంశాలపై జిల్లా అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెల నిర్వహించే సదరం యూ డీ ఐ డీ శిబిరాలను పారదర్శకంగా నిర్వహించాలని, అర్హత కలిగిన దివ్యాంగులకు మాత్రమే ధ్రువపత్రాలు జారీ చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను లేకుండా పరిష్కరించాలని, ప్రతి నెల తప్పనిసరిగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి నెల మండలానికి ఒక గ్రామం చొప్పున దివ్యాంగుల గుర్తింపు కార్యక్రమం చేపట్టాలని, సదరం ధ్రువపత్రం లేని వారికి మీ సేవ కేంద్రాల ద్వారా నమోదు చేయాలని సూచించారు. లోకో మోటర్, ఈఎన్‌టీ, కంటి వైద్య శిబిరాల నిర్వహణ, బేరా, సౌండ్ ప్రూఫ్ పరికరాల లభ్యత, వినియోగంపై అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య మాట్లాడుతూ మీ సేవ ద్వారా సదరం శిబిరాల కోసం వచ్చిన దరఖాస్తులను క్రమ సంఖ్య వారీగా పరిశీలించి అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వైద్య పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు అమలు చేస్తున్నామని, పరీక్షలు పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.ఓ శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల అక్రమ ధరలపై అధికారుల నిర్లక్ష్యం: సీపీఎం నేత దినకర్ ఫైర్




ఆసిఫాబాద్ జూన్ 27 ప్రజా జ్యోతి జిల్లాలో ఎంఆర్పీ కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నా వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్ మండిపడ్డారు. యూరియా సహా అన్ని రకాల ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కాకుండా ఇష్టానుసారంగా అమ్ముతున్నారని, వ్యాపారులు, హాకా కేంద్రాల నిర్వాహకులు సైతం రైతులను దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఇంత జరుగుతున్నా అధికారులు నామమాత్రపు తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. "జీతాలు తీసుకుంటూ రైతుల ప్రయోజనాలు కాపాడాల్సిన అధికారులు ఎవరి కోసం పని చేస్తున్నారు?" అని దినకర్ ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, ఎంఆర్పీ కంటే ఎక్కువ ధరకు అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, రైతులకు ప్రభుత్వ ధరలకే ఎరువులు అందేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

## విద్యార్థుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడు.

జన్నారం,జూన్27(ప్రజాజ్యోతి) పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడే విద్యార్థుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం సిగ్గుచేటు. జన్నారం మండలంలోని తిమ్మాపూర్ ఎంపీయుపిఎస్ ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఆలస్యంగా వెలుగు లోకి వచ్చింది. ఈ విషయం తెలియగానే ఉమెన్స్ కమిషన్ జిల్లా అధికార ప్రతినిధి కామెర కవిత శనివారం తిమ్మాపూర్ స్కూలుకు వెళ్లి బాలికలతో నేరుగా మాట్లాడారు. సదరు టీచర్ పై జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.ఈ విషయమై ఎంఈఓ ను ఫోన్లో సంప్రదించగా ప్రస్తుతం అందుబాటులో లేనని,తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

## గుండిలో జియో నెట్‌వర్క్ సమస్య: మేనేజర్‌కు ఉపసర్పంచ్ వినతి



ఆసిఫాబాద్, జూన్ 27 ప్రజా జ్యోతి ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామంలో సాంకేతిక సమస్యల కారణంగా జియో నెట్‌వర్క్ సరిగా అందక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఉపసర్పంచ్ చందన్కడే సంతోష్ అన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆయన శుక్రవారం జియో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో నెలకొన్న నెట్‌వర్క్ సమస్యను వెంటనే పరిష్కరించి, మరమ్మతులు చేపట్టాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జియో మేనేజర్, గుండి గ్రామంలో జియో 4+ నెట్‌వర్క్ పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటామని, అలాగే 8 గంటల వరకు పవర్ బ్యాకప్ ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్‌తో పాటు గుండి ఇన్‌ఫ్లూయన్సర్ దుర్గం సురేష్ కూడా ఉన్నారు.

# మనుష్యుల మనుగడకు మనసే మూలం...చెడును పారదోలు మంచిని ఆస్వాదించు, రాజయోగమే మార్గం






ఖానాపూర్ జూన్ 27( ప్రజా జ్యోతి)మనిషి మనుగడకు మూలం 'మనస్సు'! మనిషి జీవితం మనస్సు ఆడే ఒక వింత ఆటని ఓం శాంతి బ్రహ్మకుమారిస్ కేంద్రం ద్వారా వెలువడింది నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఇంద్రానగర్లో కేంద్రం నిర్వహించబడుతుందని బ్రహ్మకుమారి సంతోషిని తెలిపారు మనస్సు ఆరాట పోరాటాలను కేంద్రీకరించి నిచ్చలమైన భావనతో మెలిగేందుకు ఓంశాంతి కేంద్రాలు జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్నాయ నీ నిర్వాహకులు అన్నారు ఈ మేరకు మనసుకు సంబంధించిన వ్యాఖ్యలను ప్రకటించారు.ఈ మనస్సులో నిరంతరం.. సంకల్ప, వికల్పాలు(విల్లింగ్ డౌటింగ్ ) నడుస్తుంటాయి.మనస్సులో రోజు మొత్తంలో కొన్ని వేల ఆలోచనలు పుడుతూ ఉంటాయి..! మన ఆలోచనలు ఎంత అధికంగా ఉంటే మనసు అంత చంచలమై, అలజడికి, అశాంతికి గురి అవుతాము చేసే పనిపై ఏకాగ్రత కుదరక, పనిలో సమర్థత కోల్పోయి, పరాజయానికి గురి అవుతూ ఉంటాము. అలాంటి ఈ మనసులో ఆలోచనలు తగ్గించేందుకు అనేక ధ్యాన విధానాలను అనుసరించినా. తాత్కాలిక ఉపశమనం లభించిందే కానీ, శాశ్వత పరిష్కారాన్ని పొందలేకపోయామని అయితే ఈ అత్యంత శక్తివంతమైన మనసును జయించే ఏకైక మార్గం 'రాజయోగం' అన్నారు నీ దుఃఖానికి కారణం నీ కర్మలు,ఆ కర్మలకు కారణం నీ ఆలోచనలు, ఆ ఆలోచనలకు కారణం నీ మనస్సు..!! ఆ మనస్సు ఇప్పుడు పంచ వికారీ రూపీ రావణుని వశమై ఉంది..!! ఆ మనస్సుని నా వశం చేయడం ద్వారానే.. నీకు పరమశాంతితో కూడిన నిర్మల మనస్సు లభిస్తుంది..!! తద్వారా ఆలోచనల్లో శ్రేష్ఠత చేకూరి, కర్మలలో ప్రావీణ్యత పెరిగి, సత్ఫలితాలను పొంది, సుఖవంతమైన జీవితాన్ని అనుభవించగలవు.." అని నిర్దేశనం ఇస్తూ, అందుకు రాజయోగమే తరుణోపాయం అని సూచిస్తున్నారు పరమాత్మ.కనుక అత్యంత శక్తివంతమైన ఈ మనసును శక్తితో కాక యుక్తిగా ప్రేమతో జయించాలి! ప్రతి పనీ చేస్తూ..మనసుతో ప్రేమగా మాట్లాడుతూ ఉండాలి! మనసులో వచ్చే ప్రతి ఆలోచనను అణచివేయక(కంట్రోల్ ), సరిదిద్దితూ(పరివర్తన చేస్తూ) ఉండాలి..!! ఉద్వేగాలు కలుగకుండా.. సాత్విక గుణాలను మననం చేస్తూ, అనుభవం చేయిస్తూ ఉండాలి ఎటువంటి అభ్యాసం చేయాలి అన్నా.. మనసు సహకరించాలి. అందుకు నిరంతరం ఈమనస్సులో ప్రేమతో పరమాత్ముని స్మృతి చేయాలి రాముడు(గుడ్ /గాడ్ )ఉన్న చోట రావణుడు(బ్యాడ్ /డెవిల్) నిలవలేడు.రాముడైన పరమాత్మతో సాంగత్యం(స్మృతి) చేయాలి అంటే అందుకు అర్హత.., మనసులో స్వయం పట్ల, సర్వులు పట్ల శుభభావన, శుభకామనలు కలిగి ఉండాలి, అందుకు త్రికరణ శుద్ధిగా సహాయోగం(సేవ) చేయాలి..!! బాహ్యం నుండి శుద్ధమైన విషయాలను గ్రహించాలి అనే పత్యం ఉండాలి.ఈవిధమైన అభ్యాస వైరాగ్యాల ద్వారా మనసుని మంచి మిత్రునిగా చేసుకుంటే జీవితమే నందనవనం అవుతుందని దీనికి రాజయోగమే మార్గం అన్నారు సర్వులు తమలోనే ఉన్న మంచి మిత్రుని(మనసుని)కి, పరమాత్ముని స్మృతి అనే శ్రేష్ఠ బహుమానం ఇచ్చి అవధులు లేని ఆనందాన్ని దానికి అనుభవం చేయించాలి. తద్వారా మానవాళి మనస్సు ప్రశాంతత కూడి పరమాత్మలో లీలమై పరిశుద్ధమైతుందని రాజయోగం ద్వారా అలవర్తుందని ప్రకటించారు మరిన్ని సలహా సూచనల కోసం సెల్ నెంబర్ 9912916539 ఓం శాంతి బ్రహ్మకుమారి కేంద్రం నిర్మల్ ల్లోని ఇందిరానగర్ వారిని సంప్రదించాలన్నారు

# గుండెపోటుతో విశ్రాంత ఉపాధ్యాయుడు ఘంటసాల గంగాధర్ మృతి

ఖానాపూర్ జూన్ 27 (ప్రజాజ్యోతి) నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు శ్యామల గంగాధర్( ఘంటసాల) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ నిజాంబాద్ ఆసుపత్రిలో మృతి చెందారు. శ్యామల గంగాధర్ గా ఉన్న మృతిని ఇంటిపేరు ఘంటసాల గంగాధర్ గా మారింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ ప్రాంతంలో ఎక్కడ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగిన లేదా హైందవ సాంప్రదాయంలోని శ్రీరామనవమి విజయదశమి ఉగాది ఆలయాల్లో వార్షికోత్సవాల్లో వ్యాఖ్యాతగా మెలుగుతూ అనేక భక్తి గీతాలతో పాటు ఘంటసాల పాటలను పాడి మైపర్పించిన గంగాధర్ కు ఘంటసాల గంగాధర్ గా పేరు వచ్చింది ఈ ప్రాంత ప్రజ గుండెల్లో స్థిర నివాసం ఏర్పరచుకున్న గంగాధర్ మృతి పట్ల పలు దేవాలయ సంఘాలు ఉద్యోగ ఉపాధ్యాయ, యువజన సంఘాల తో పాటు పద్మశాలి సంఘాలు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు ఈ సందర్భంగా హిందూ ఉత్సవ సమితి మాజీ అధ్యక్షులు సీనియర్ జర్నలిస్ట్ రాచమల్ల రాజశేఖర్ స్పందిస్తూ హిందూ ఉత్సవ సమితిలో శాశ్వత సభ్యులుగా ఉత్సాహంగా పనిచేసి కార్యక్రమాలు విజయవంతం కృషిచేసిన గంగాధర్ మృతి తీరని లోటని అన్నారు



ఈ సందర్భంగా హిందూ ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు అల్లాడి వెంకటేశ్వర్లు గంగాధర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపుపై దృష్టి పెట్టాలి





## జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య

**మంచిర్యాల, 27, జూన్ (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు సమగ్రంగా వివరించి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి పి. చంద్రయ్య సూచించారు. శనివారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు, ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, యూఆర్ఎస్, టీజీఆర్ఐఈ, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులతో ప్రత్యేక సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా పి. చంద్రయ్య మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో అడ్మిషన్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ హాజరు శాతం 100 శాతం నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం మెరుగైన వసతులు అందుబాటులో ఉన్నందున వాటిని తల్లిదండ్రులకు తెలియజేసి విద్యార్థుల నమోదు పెంచాలని అ న్నారు. పాఠశాలల్లో నమోదైన ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ రూపొం దించాలని, ప్రతి విద్యార్థికి ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించామని తెలిపారు. త్వరలోనే రెండు జతల యూనిఫాంలు కూడా అందించనున్నట్లు తెలిపారు .మండల విద్యాధికారులు ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేయాలని, జీరో ఎన్‌రోల్మెంట్ ఉన్న నాలుగు పాఠశాలలను పునఃప్రారంభించినట్లు వెల్లడించారు. ప్రీ-ప్రైమరీ పాఠశాలలకు త్వరలో ఇన్‌స్ట్రక్టర్లను నియమించనున్నట్లు తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో 100 శాతం నమోదు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులను యుడైస్ ప్లస్‌లో నమోదు చేయాలని, ప్రభుత్వం విద్యారంగంలో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అదనపు సంచాలకులు లలిత, సెక్టోరియల్ అధికారులు ఎం. భరత్ కుమార్, కె. కృష్ణమూర్తి, జై సత్తయ్య, కె. విజయలక్ష్మి, ఏ. రాజ్ కుమార్, అన్ని మండలాల విద్యాధికారులు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# నేరడిగొండ లో శనివారం వస్తే.. ఆర్టీసీకి తప్పని తిప్పలు!

**నేరడిగొండ జూన్ 26(ప్రజాజ్యోతి):**మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించే వారాంతపు సంత కారణంగా ప్రధాన రహదారిపై తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. సంత రోజున రహదారికి ఇరువైపులా వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేయడం, కొనుగోలు దారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలిపివేయడంతో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**ఇరుకుగా మారిన రహదారి**

ప్రతి వారం సంతకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు. కూరగాయలు, పండ్లు, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజలు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు తదితర వాహనాలను రహదారిపైనే పార్కింగ్ చేయడంతో రోడ్డు పూర్తిగా ఇరుకుగా మారుతోంది. దీంతో ఆర్టీసీ బస్సులు ట్రాఫిక్‌లో చిక్కుకుని నిమిషాల తరబడి ఆలస్యంగా నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**సమయానికి చేరలేకపోతున్న ప్రయాణికులు**

ఈ ట్రాఫిక్ సమస్య కారణంగా ఉద్యోగులు, విద్యార్థులు, దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు, ఇతర అత్యవసర సేవల వాహనాల రాకపోకలు కూడా సజావుగా సాగకపోవడంపై స్థానికులు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

**శాశ్వత పరిష్కారం చూపాలి**

ప్రస్తుతం సంత జరుగుతున్న ప్రాంతంలోని రహదారి ఇరుకుగా ఉండటంతో ప్రతి శనివారం ఇదే సమస్య పునరావృతమవుతోంది. అందువల్ల ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా విశాలమైన స్థలాన్ని గుర్తించి వారాంతపు సంతను అక్కడికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, వారాంతపు సంతకు ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కిరిడిలో ఇంటింటికీ ఓటరు ధ్రువీకరణ ఫారాల పంపిణీ

**ఓటరు జాబితా సవరణకు గ్రామస్థుల సహకారం కోరిన ఉపసర్పంచ్**



**ఆసిఫాబాద్ జులై 27 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి కిరిడి గ్రామపంచాయతీలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటరు ధ్రువీకరణ ఫారాలను శుక్రవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ కోట్రంగే సాగర్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి, జీపీఓ, కరోబార్‌తో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో ఉన్న ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత వివరాలను ధ్రువీకరించుకుని ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. జాబితాలో పేరు లేకపోయినా, పేరు, చిరునామా లేదా ఇతర వివరాల్లో తప్పులు ఉన్నా వెంటనే సవరించుకునేలా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో గ్రామ ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్ హరిత

**ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ**

**గైర్హాజరు వైద్యులు, అధికారులకు షోకాజ్ నోటీసుల ఆదేశం**



**ఆసిఫాబాద్, జూన్ 27** ప్రజా జ్యోతి వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె వార్డులు, మందుల నిల్వలు, హాజరు పట్టిక, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధుల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన మందులను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఆసుపత్రి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా, చెత్త పేరుకుపోకుండా పారిశుధ్య చర్యలు నిరంతరం చేపట్టాలని సూచించారు. హాజరు పట్టికను పరిశీలించిన సందర్భంగా విధులకు గైర్హాజరైన వైద్యులు, ఆసుపత్రి పర్యవేక్షకులపై ఉన్నతాధికారులకు సిఫారసు చేయడంతో పాటు షోకాజ్ నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎర్వచింతల్లో 29న ఇసుక వేలం

**తాసిల్దార్ సుజాత రెడ్డి**

**ఖానాపూర్ జూన్ 27 (ప్రజా జ్యోతి )** ఖానాపూర్ మండలంలోని ఎర్వచింతల్ గ్రామపంచాయతీ పరిధిలో ఈనెల 29న ఇసుక వేలం వేస్తున్నట్లు తాసిల్దార్ సుజాత రెడ్డిలో తెలిపారు ఎర్వ చింతల్ లొ పరిసర ప్రాంతాల్లోజిపిఓ, ఆర్ ఐ నగేష్ల ఆధ్వర్యంలో పట్టుబడిన 25 ట్రిప్పుల ఇసుక వేలంలో పాల్గొనేవారు 5వెల ధరావత్తు చెల్లించి పాల్గొనాలని అన్నారు ఎక్కువ వేలంపాటలో పాడిన వ్యక్తులకు ఇసుక అప్పగించడం జరుగుతుందని ధరావత్ సొమ్ము టెండర్ రాని వ్యక్తులకు తిరిగి ఇవ్వడం జరుగుతుందని తాసిల్దార్ సుజాత రెడ్డి వివరించారు

## 25 ఏళ్ల తర్వాత తెరుచుకున్న గిరిజన పాఠశాల: విద్యార్థులకు పలకల పంపిణీ





**కేరమేరి జూన్ 27 ప్రజా జ్యోతి** కెరమెరి, మండలంలోని కొత్తగూడ (సాకడ) గ్రామంలో 25 ఏళ్లుగా మూతపడిన ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలను శనివారం అధికారులు పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా పెందోర్ శ్యాంరావు పటేల్ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు విరాళంగా పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు పెందోర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, పిల్లలందరూ క్రమం తప్పకుండా బడికి రావాలని, ప్రతి బిడ్డను పాఠశాలకు పంపించే బాధ్యత తల్లిదండ్రులదేనని సూచించారు. గిరిజన పిల్లల భవిష్య త్తుకు చదువే పునాది అని అన్నారు.పాఠశాల పునఃప్రారంభం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల పునరు ద్ధరణకు చొరవ చూపి కృషి చేసిన సాక్షి మీడియా, పెందోర్ శ్యాంరావు పటేల్ సేవా సమితి అధ్యక్షులు పెందోర్ శ్రీనివాస్, ఎస్ఈఆర్పీ చాహకటి శ్యాంరావులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరాం, స్థానిక సర్పంచ్ తుంరం లచ్చు, పంచాయతీ కార్యదర్శి గణేష్, మాజీ సర్పంచ్ తొడసం జగన్నాథ్ రావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నీమ్‌గూడలో నూతన బోర్‌వెల్ ఏర్పాటు





**కేరమేరి జూన్ 27 ప్రజా జ్యోతి** కేరమేరి మండలంలోని ఆగర్వాడ గ్రామపంచాయతీ పరిధిలోని నీమ్‌గూడ గ్రామంలో బోర్‌వెల్ చెడిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ వద్దుగే రోజా సోనాజీ వెంటనే స్పందించి నూత న బోర్‌వెల్‌ను ఏర్పాటు చేయించారు. బోర్‌వెల్ అమర్చడంతో గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య నుంచి ఉపశమనం లభించింది. సమస్యను వెంటనే పరిష్కరించిన సర్పంచ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యలు పరిష్కరించాలంటూ

**మండల తాసిల్దారులకు అఖిలభారత ఐక్య రైతు సంఘం వినతి పత్రాలు**



**ఖానాపూర్ జూన్ 27 (ప్రజా జ్యోతి )**తెలంగాణ రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత ఐక్య రైతు సంఘం ( ఏఐయుకేఎస్ ) ఆధ్వర్యంలో ఖానాపూర్, కడం పెంబి దస్తురాబాద్ తహసిల్దార్లకు వినతి వినతి పత్రాలు శనివారం ఆయా కార్యాలయాల్లో అందజేశారు ప్రస్తుతం వర్షాకాల పంటల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు విత్తనాల కొరత, నకిలీ విత్తనాలు, ఎరువుల కొరత, పెరుగుతున్న పెట్టుబడి భారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల సమస్యలు మరింత తీవ్రతరం అవుతున్నాయని ఏఐయుకేఎస్ పేర్కొంది.రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, యూరియాను యాప్ ద్వారా బుక్ చేసుకునే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసింది. పెరుగుతున్న ఎరువుల ధరలను నియంత్రించి రైతులకు అందుబాటు ధరల్లో సరఫరా చేయాలని కోరింది.కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రైతు భరోసా పెట్టుబడి సాయం సీజన్ ప్రారంభంలోనే అందించాలని, గత బకాయిలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేసింది.రైతులు పండించిన ప్రతి రకం వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, కొనుగోళ్లపై పరిమితులు విధించవద్దని డిమాండ్ చేసింది.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో రైతులపై జరుగుతున్న కోతలను వెంటనే నిలిపివేయాలని, నిబంధనలకు విరుద్ధంగా తీసుకున్న మొత్తాన్ని రైతులకు చెల్లించాలని కోరింది. మొక్కజొన్నతో పాటు అన్ని పంటల బకాయి చెల్లింపులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేసింది.పంట మార్పిడిని ప్రోత్సహించాలంటే అన్ని పంటలకు కనీస మద్దతు ధర (ఎం ఎస్ పి) ప్రకారం కొనుగోలు హామీ ఇవ్వాలన్నారు పోడు సాగుదారుల సమస్యలను పరిష్కరించి, అర్హులైన గిరిజన రైతులకు పోడు పట్టాలు ఇచ్చి భూ హక్కులు కల్పించాలని డిమాండ్ చేసింది. అలాగే సాధ బైనమాల ద్వారా కొనుగోళ్లు చేసిన భూములు అన్నిటికీ పాస్ బుక్కులు ఇవ్వాలి, పైన ఉన్నదిరైతాంగ సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని అఖిల భారత ఐక్య రైతు సంఘం హెచ్చరించింది. ఈ కార్యక్రమం లో ఖానాపూర్ మండల నాయకులు జకుల రాజన్న, నర్సింగ రావు,అభి యాదవ్, మచ్చ శ్రీనివాస్, గోపాల్ రావు, శంకర్, లక్ష్మణ్, మధు, అను, లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఆసుపత్రిలో నిర్లక్ష్యంపై సీపీఎం ఆగ్రహం

**సూపరింటెండెంట్‌తో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని దినకర్ డిమాండ్**

**ఆసిఫాబాద్ జూన్ 27 ప్రజా జ్యోతి** జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పేద రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్ ఆరోపించారు. జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలో సూపరింటెండెంట్ విధుల్లో లేకపోవడం ప్రభుత్వ వైద్య వ్యవస్థలో నెలకొన్న నిర్లక్ష్యానికి నిదర్శన మని విమర్శించారు.జిల్లా ఆసుపత్రి నిర్వహణ బాధ్యతలు చేపట్టాల్సిన అధికారే సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరవడం సరికాదని, ఇలాంటి పరిస్థితుల్లో వైద్య సేవలు ఎలా మెరుగుపడతాయని ప్రశ్నించారు. వర్షాకాలంలో గిరిజన, మారుమూల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు ఆసుపత్రికి వస్తున్న నేపథ్యంలో వైద్యులు అందుబాటులో లేకపోవడం ఆందోళనకరమన్నారు. దీనివల్ల ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కోల్పోయి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొన్నారు.సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైన సూపరింటెండెంట్‌తో పాటు బాధ్యతలు విస్మరిస్తున్న వైద్యులు, సిబ్బందిపై జిల్లా యంత్రాంగం వెంటనే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని దినకర్ డిమాండ్ చేశారు. జిల్లా ఆసుపత్రిలో 24 గంటలపాటు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుని పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రజా సంఘాలతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



# మైనార్టీ ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత

## మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబైదుల్లా కొత్వాల్

### రూ.20 కోట్లతో నిర్మించినమైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల--కళాశాల భవనం ప్రారంభం








**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 27, (ప్రజా జ్యోతి)** మైనార్టీల అభివృద్ధికి రాష్ట్ర ప్ర భుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇ స్తుందని తెలంగాణ రాష్ట్ర మై నార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చై ర్మన్ ఓబైదుల్లా కొత్వాల్ అ న్నారు.ఆదిలాబాద్ పట్టణం లోని బాలాజీనగర్‌లో రూ.20 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మైనార్టీ రెసిడెన్షి యల్ పాఠశాల--కళాశాల (బాలికల) భవనాన్ని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శా ఖ మంత్రి అజారుద్దీన్, ప్రభు త్వ సలహాదారు షబ్బీర్ అలీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్ శనివారం ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నూతన భవనంలోని తర గతి గదులు, వసతి గదులు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించిన మం త్రులు, విద్యార్థినులకు అత్యుత్తమ విద్యావాతావరణం కల్పించేలా ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పిస్తోందని తెలిపారు. ఈ సంద ర్భంగా ప్రిన్సిపాల్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ మైనార్టీల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధా న్యత ఇస్తోందన్నారు. నాణ్య మైన విద్యతో పాటు సురక్షిత వసతి, ఆధునిక మౌలిక వస తులు కల్పించడం ద్వారా గ్రా మీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించే అవకాశాలు మరిం త మెరుగుపడతాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదా రులకు షాదీ ముబారక్ చె క్కులు, మహిళా మైనార్టీ యో జన కింద రూ.50 వేల ఆర్థిక సహాయం, ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద 20 కుట్టు మిషన్ యూనిట్లు, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని "రేవంతన్న సహారా ఫర్‌ది మిస్కిన్స్" పథకం కింద మోపెడ్ వాహనాలను అంద జేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లి దండ్రులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఎం పీ జి.నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, మైనా ర్టీ సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి బి. షఫీఉల్లా, జిల్లా క లెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్ర, టీజీ ఎం ఆర్ ఈ ఐ ఎస్ వైస్ చైర్మ న్ ఫహీం ఖురేషి, ప్రజాప్రతి నిధులు, అధికారులు, ఉపాధ్యా యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఖానాపూర్ మున్సిపాలిటీ 12వ వార్డు సుభాష్ నగర్ లో ఓటరు జాబితా ( ఎస్ ఐ ఆర్ ) ఇంటింటా సర్వే



**ఖానాపూర్, జూన్ 27: (ప్రజా జ్యోతి)** ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు సుభాష్ నగర్‌లో ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ నెంబర్ 232 లో శనివారం ఇంటింటి ఓటరు గణన ఫారం పంపిణీ నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ-2 ఎస్.కె. షబ్బీర్ పాషా మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రతి అర్హులైన ఓటరుకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. వార్డులోని ప్రతి ఓటరు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను ఓటరు జాబితాలో పరిశీలించి, ఫారం లు ఖచ్చితమైన వివరాలతో నింపి నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకొని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సర్వేను బీఎల్ఓ మమత నిర్వ హించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ అయ్యూబ్, అల్లెపు రవి హుజెర్, కాలనీ వాసులు జమీర్, తఖ ఉల్లా, ఉమర్, అషు, అమేర్, అద్నాన్ తదితరులు పాల్గొన్నారు.

# సదరం--యూడీఐడీ శిబిరాలను పారదర్శకంగా నిర్వహించాలి

: దివ్య దేవరాజన్

### పెండింగ్ దరఖాస్తులు లేకుండా పరిష్కరించాలని ఆదేశం




**ఆసిఫాబాద్, జూన్ 27 ప్రజా జ్యోతి** సదరం--యూడీఐడీ శిబిరాల నిర్వహణను పారదర్శ కంగా, పకడ్బందీగా చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ అధికారులను ఆదేశించారు. శనివారం జూమ్ సమావేశం ద్వారా జిల్లా అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెల నిర్వహించే సదరం--యూడీఐడీ శిబిరాలను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు ప్రతి నెలా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి అర్హులైన దివ్యాంగులకు మాత్రమే ధృవపత్రాలు జారీ చేయాలని తెలిపారు.వినికిడి లోపం ఉన్న దివ్యాంగుల కోసం నిర్వహించే శిబిరాలకు అవసరమైన బేరా పరికరాల అంచనా వ్యయ వివరాలను సమర్పించాలని సూచిం చారు. అలాగే మీ సేవ ఆపరేటర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వ హించి సదరం దరఖాస్తుల నమోదు ప్రక్రియపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు.జిల్లా కేంద్రం లోని సమీకృత జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అధికా రులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ మీసేవ ద్వారా వచ్చిన దరఖాస్తులను క్రమ సం ఖ్య వారీగా పరిశీలించి దరఖాస్తుదారులకు వైద్య పరీక్షలు నిర్వ హిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వైద్య పరీ క్షలు పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

# పేద ప్రజలకు అండగా వెన్నంటి ఉంటాం






## ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

### లబ్ధిదారులకు సిఎంఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ

### ప్రభుత్వ ఆసుపత్రి సందర్శన

**లక్షెట్టిపేట, జూన్ 27,(ప్రజాజ్యోతి):** పేద ప్రజలకు అండగా వెన్నంటి ఉంటామని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కే ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సభలో దండేపల్లి, లక్షెట్టిపేట మండల, మున్సిపాలిటీ చెందిన 117 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి విలువైన 4,60,7600/- రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..... సీఎం సహాయనిధి ద్వారా ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలబడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలోనే మన మంచిర్యాల నియోజకవర్గానికి 2,911 సిఎంఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ చేశామన్నారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆయన ఆసుపత్రి అధికారులకు రోగుల ఆరోగ్యం, ఆసుపత్రి పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట్ మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి-నర్సయ్య, వైస్ చైర్మన్ మోత్కూరి రాజేశ్వరి-వెంకటస్వామి గౌడ్, మంచిర్యాల జిల్లా ఆర్ టి ఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా ఆర్ జి పి ఆర్ ఎస్ అధ్యక్షులు గద్దం త్రిమూర్తి, జిల్లా నాయకులు చల్లా నాగభూషణం, పూర్ణచంద్ర రావు, దండేపల్లి మండల అధ్యక్షులు అక్కల వెంకటేశ్వర్లు, లక్షెట్టిపేట్ పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీ, లక్షెట్టిపేట్ మండల అధ్యక్షులు, సర్పంచ్ నలిమెల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పింగిలి రమేష్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆరీఫ్, కౌన్సిలర్లు, సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, కో-ఆప్షన్ సభ్యులు, వార్డు మెంబర్లు, నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రిలో నకిలీ పత్తి విత్తనాల ముఠా గుట్టురట్టు



**మందమర్రి, జూన్ 27(ప్రజాజ్యోతి ):** రైతులను మోసం చేస్తూ నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను మంద మర్రి పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో అరెస్ట్ చేశారు.నిందితుల నుంచి 100 కిలోల నకిలీ పత్తి విత్తనాలు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.మందమర్రి ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం, శనివారం ఉదయం ఎన్‌హెచ్-363లోని అందుగులపేట్ శ్రీ కన్వెన్షన్ హాల్ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరు బైక్‌లను ఆపి తనిఖీ చేయగా, ఎలాంటి ధ్రువీకరణ లేబుళ్లు, బిల్లులు లేని 100 కిలోల లూజ్ పత్తి విత్తనాలు లభించాయి.అరెస్టైన వారిలో మాకినేని రాఘవేంద్ర (39), కట్ల నరేష్ (41), పుట్టగంటి పవన్ కుమార్ (39) ఉన్నారు. రైతులు ధ్రువీకరణ పొందిన విత్తనాలనే కొనుగోలు చేయాలని, నకిలీ విత్తనాల విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.నకిలీ విత్తనాల రవాణా ముఠాను పట్టుకున్న ఎస్ఐ నరేష్‌తో పాటు కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రాకేష్, చైతన్య, మహేందర్, సంతోష్‌లను ఉన్నతాధికారులు అభినందించారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల ముఖేష్ గౌడ్‌కు ఘన సన్మానం

**పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించిన కేసరి ఆంజనేయులు గౌడ్**




**ఆసిఫాబాద్ జూన్ 27 ప్రజా జ్యోతి** బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన గాజుల ముఖేష్ గౌడ్‌ను శుక్రవారం మంచిర్యాలలో బీజేపీ రాష్ట్ర నాయకులు కేసరి ఆంజనేయులు గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కేసరి ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ, గాజుల ముఖేష్ గౌడ్ రాష్ట్ర స్థాయిలో ఓబీసీ వర్గాల సంక్షేమం, అభివృద్ధితో పాటు పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. కొత్త బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించాలని శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ మంచిర్యాల జిల్లా కార్యదర్శి వేముల రమేష్ పాల్గొని గాజుల ముఖేష్ గౌడ్‌ను అభినందించారు.

# బీజేపీ ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.. సొంత ప్రభుత్వంపైనే వెడ్మ బొజ్జు అసంతృప్తి

### కాంగ్రెస్‌లో కలకలం.. ఉమ్మడి ఆదిలాబాద్ రాజకీయాల్లో కొత్త చర్చకు తెర

**మంచిర్యాల, 27, జూన్ (ప్రజాజ్యోతి);** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో తాజాగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద చర్చకు దారితీశాయి. "కాంగ్రెస్ పార్టీలో బీజేపీ ఎమ్మెల్యేలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు" అంటూ ఆయన బహిరంగంగా అసహనం వ్యక్తం చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉండి సొంత ప్రభుత్వంపైనే అసంతృప్తి వ్యక్తం చేయడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. చాలా కాలం తర్వాత తమ పార్టీ తిరిగి అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా భారీ సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారంటీ పథకాల అమలు చేస్తూ "ప్రజా ప్రభుత్వం" నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నర సంవత్సరాలు గడిచిపోతున్న నేపథ్యంలో పాలన సజావుగానే సాగుతున్నప్పటికీ రాజకీయంగా కొన్ని పరిణామాలు కొత్త చర్చలకు కారణమవుతు న్నాయి. మరోవైపు ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రభుత్వంపై వివిధ అంశాల్లో తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. ప్రభుత్వ విధానాలను లక్ష్యంగా చేసుకొని పలు ఆరోపణలు చేస్తూ అధికార పక్షాన్ని ఇబ్బందులకు గురిచేయాలని చూస్తున్నాయి. అయితే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా వాటికి దీటుగా సమాధానాలు ఇస్తూ రాజకీయంగా బలమైన కౌంటర్లు ఇస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అధికార పార్టీకి చెందిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తన అసంతృప్తిని బహిరంగంగా వ్యక్తం చేయడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రంలో అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న తనకే ఏమి జరుగుతుందో తెలియడం లేదని ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తరపున మంచిర్యాల నుంచి కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, చెన్నూరు నుంచి గడ్డం వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి నుంచి గడ్డం వినోద్, ఖానాపూర్ నుంచి తొలిసారి యువ ఎమ్మెల్యేగా వెడ్మ బొజ్జు పటేల్ విజయం సాధించారు. అయితే అదే జిల్లాలో బీజేపీ తరపున ఆదిలాబాద్ నుంచి పాయల్ శంకర్, నిర్మల్ నుంచి మహేశ్వర్ రెడ్డి, ముథోల్ నుంచి రామారావు పటేల్, సిర్పూర్ నుంచి పాల్వాయి హరీష్ బాబు విజయం సాధించారు. బీఆర్ఎస్ తరపున బోథ్ నియోజకవర్గంలో అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ నుంచి కోవా లక్ష్మి గెలుపొందారు.అంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం తొమ్మిది అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ నాలుగు, కాంగ్రెస్ మూడు, బీఆర్ఎస్ రెండు స్థానాలు గెలుచుకోవడం ద్వారా జిల్లాలో మూడు పార్టీల మధ్య రాజకీయ పోటీ తీవ్రంగా ఉందని స్పష్టమవుతోంది. ఇక వెడ్మ బొజ్జు పటేల్




చేసిన వ్యాఖ్యల్లో తన ఆవేదన స్పష్టంగా కనిపించిందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. తనకంటే బీజేపీ ఎమ్మెల్యేలైన పాయల్ శంకర్, మహేశ్వర్ రెడ్డిలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి రాత్రింబవళ్లు కష్టపడిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పుడు దూరం అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి పోటీగా ఉండే ప్రతిపక్ష పార్టీల నాయకులను పార్టీలోకి తీసుకొని వారికి ప్రాధాన్యత ఇస్తే తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ఇంకా తన నియోజకవర్గంలో ఏం జరుగుతుందో కూడా తనకు తెలియడం లేదని, ఇతర పార్టీల నాయకులు హైదరాబాద్‌కు వెళ్లి మంత్రుల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకుంటున్నారని, అధికారులు వారికి పనులు చేసి పెడుతున్నారని ఆరోపించారు. స్థానిక ప్రజాప్రతినిధిగా తనను పట్టించుకోవడం లేదన్న భావనతో ఆయన వ్యాఖ్యలు చేశారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు, పార్టీ అధిష్టానం ఎలా స్పందిస్తుందోనని అందరిలో ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం బంతి అధిష్టానం కోర్టులో పడిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పార్టీకి పెద్దన్నగా వ్యవహరిస్తూ ఎప్పుడూ ముందుండే సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఈ అంశంపై ఎలా స్పందిస్తారన్నది కూడా ఆసక్తికరంగా మారింది. పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నం చేస్తారా అనే చర్చ సాగుతోంది. ఇక ఇప్పటికే బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై వరుస విమర్శలు చేస్తుండగా, బీజేపీ కూడా కేడర్‌ను బలోపేతం చేసుకుంటూ మరింత బలం పెంచుకునే ప్రయత్నాలు చేస్తోంది. రాబోయే 2028 అసెంబ్లీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ లక్ష్యంగా ముందుకు సాగాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఇలాంటి అంతర్గత అసంతృప్తి స్వరాలు రాజకీయంగా ఎంత ప్రభావం చూపిస్తాయనేది భవిష్యత్తులో తేలనుంది.

## పోడు రైతుల సమస్యలు పరిష్కరించాలి

**జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు కాంగ్రెస్ నేతల వినతి**





**ఆసిఫాబాద్ జూన్ 27 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని పోడు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ డీసీసీ అధ్యక్షుడు కె. విశ్వ ప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి శనివారం వినతిపత్రం సమర్పించారు.కెరమెరి మండలం సుర్దాపూర్, జైనూర్ మండలం పొలస, సిర్పూర్ (యూ), లింగాపూర్ మండలం వంజరిగూడ గ్రామాల పరిధిలోని పోడు రైతులు అనేక సంవత్సరాలుగా ఆ భూముల్లోనే సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని, ఆ భూములే వారి కుటుంబాలకు ప్రధాన జీవనాధారమని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.వినతిపై సానుకూలంగా స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసి పోడు రైతుల సమస్యలను పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుదమేత విశ్వనాథ్, ఆసిఫాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మసాదే చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా సవరణకు ప్రజలు సహకరించాలి

**మంచిర్యాల 39వ డివిజన్‌లో ఇంటింటికీ ఎస్ఐఆర్ ఫారాల పంపిణీ**



**మంచిర్యాల, 27, జూన్ ( ప్రజా జ్యోతి ):** ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) లో భాగంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 39వ డివిజన్‌లో శనివారం ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేశారు. ఓటర్ జాబితాలో నమోదైన ప్రతి ఓటరుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు కలిసి ఫారాలు అందజేస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంచిర్యాల ఎమ్మార్వో రఫత్తుల హుస్సేన్ మాట్లాడుతూ ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలు పూర్తి స్థాయిలో సహకరిం చాలని కోరారు. బీఎల్ఓలు, బీఎల్ఏలు ఇంటికి వచ్చినప్పుడు అవసరమైన వివరాలు అందించాలని సూచించారు. ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు కావడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎంతో కీలకమని అ న్నారు. ఈ కార్యక్రమంలో డీటీ ప్రసాద్, 39వ డివిజన్ కార్పొరేటర్ పూదరి సునీత--ప్రభాకర్, బీఎల్ఏలు స్వప్న రాణి, దుస్స తిరుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు జిట్ట శ్రీనివాస్, యాదాల విజయ్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎస్ఐఆర్ ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు సూచనలు చేశారు. బీఎల్ఓ, బీఎల్ఏ సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు సహకరించాలని, పాస్‌పోర్ట్ సైజు ఫోటో సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. చనిపోయిన వారు, వలస వెళ్లిన వారి పేర్లు ఓటర్ జాబితాలో ఉంటే తొలగించాలని, అలాగే 18 సంవత్సరాలు నిండిన కొత్త ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. "మీ ఓటు మీ హక్కు మీ బాధ్యత" అని ప్రజలకు పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ ఉద్యోగి పై దాడి చేసిన నేపథ్యంలో బీట్ అధికారి ఫిర్యాదు మేరకు

**కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా చునార్కర్ సూర్యోధన్ ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయస్థానం రిమాండ్ కు తరలించింది. సిర్పూర్ (టి) ఎస్.ఐ, డి.సాగర్:**

**జూలై 27 సిర్పూర్(టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) పోలీస్ స్టేషన్ పరిధిలోని కొమ్ము గూడ గ్రామానికి చెందిన చునార్కర్ దుర్యోధన్ అనే వ్యక్తి అటవీ శాఖ అధికారులు విధులు నిర్వహించకుండా అడ్డుపడి, ప్రభుత్వ ఉద్యోగి పై దాడి చేసిన నేపథ్యంలో అతనిపై బీట్ అధికారి ఫిర్యాదు చేయగా దుర్యోధన్ పై కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం అతనిని రిమాండ్ తరలించడం జరిగిందని సిర్పూర్(టి) ఎస్.ఐ, డి.సాగర్ తెలిపారు.

# పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**: కలెక్టర్ హరిత**

**నేడు జిల్లావ్యాప్తంగా 667 పోలియో బూత్‌లు**

**0--5 ఏళ్లలోపు 46,516 మంది చిన్నారులకు చుక్కల లక్ష్యం**



**ఆసిఫాబాద్, జూన్ 27 ప్రజా జ్యోతి** జిల్లాలోని ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన పల్స్ పోలియో ప్రచార పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి ప్రారంభిస్తామని తెలిపారు. జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల లోపు ఉన్న 46,516 మంది చిన్నారులను గుర్తించి అందరికీ పోలియో చుక్కలు అందేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమం కోసం జిల్లాలో 3,101 వ్యాక్సిన్ వైల్స్, 667 పోలియో బూత్‌లు, 14 ట్రాన్సిట్ పాయింట్లు, 22 మొబైల్ బృందాలు, 86 రూట్ సూపర్‌వైజర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మొత్తం 2,668 మంది వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలందిస్తారని తెలిపారు. ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, వలస కార్మికులు, సంచార జాతులు, మత్స్యకారులు, పట్టణ శివారు ప్రాంతాలు, కొత్త కాలనీలు, వ్యవసాయ క్షేత్రాల్లో నివసించే హైరిస్క్ వర్గాల పిల్లలకు ప్రత్యేకంగా పోలియో చుక్కలు అందించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. సాధారణ ఇమ్యునైజేషన్‌లో భాగంగా అదే రోజు పోలియో వ్యాక్సిన్ తీసుకున్న చిన్నారులు కూడా పల్స్ పోలియో కార్యక్రమంలో తప్పనిసరిగా మళ్లీ పోలియో చుక్కలు వేయించుకోవాలని సూచించారు. సోమవారం, మంగళవారం ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మిగిలిన చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగంగా తల్లిదండ్రులంతా తమ చిన్నారులను సమీపంలోని పోలియో బూత్‌కు తీసుకువచ్చి చుక్కలు వేయించాలని కలెక్టర్ కోరారు.

# మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం



రూ.20 కోట్లతో నిర్మించిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠ శాల--కళాశాల నూతన భవ నాన్ని ప్రారంభించిన రాష్ట్ర మంత్రులు






**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 27, (ప్రజా జ్యోతి)** మైనార్టీ విద్యార్థులకు అత్యు న్నత ప్రమాణాలతో కూడిన విద్యతో పాటు ఆధునిక వస తులు కల్పించి, వారిని అన్ని రంగాల్లో పోటీతత్వానికి సిద్ధం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్ర ధాన లక్ష్యమని రాష్ట్ర ఎక్సై జ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మం త్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడలో రూ.20 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మైనార్టీ రెసిడెన్షి యల్ పాఠశాల-- కళాశాల (బాలుర) భవనాన్ని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూతన భవనంలోని తరగతి గదు లు, వసతి గదులు, భోజనశాల, ఇతర మౌలి క సదుపాయాలను మంత్రులు పరిశీలించారు. విద్యార్థు లకు నాణ్యమైన విద్యతో పాటు అత్యాధునిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇ స్తోందని తెలిపారు. మైనార్టీ విద్యార్థులు విద్యనే ఆయు ధంగా మలుచుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశా లను పూర్తిస్థాయిలో వినియో గించుకోవాలని సూచించారు. విద్యా రంగంలో సమాన అవ కాశాలు కల్పించేందుకు ప్రభు త్వం కట్టుబడి ఉందని, రా ష్ట్రంలోని మైనార్టీ విద్యాసం స్థలను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు కొనసా గుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యారంగం అభి వృద్ధికి అత్యధిక ప్రాధాన్యత నిస్తూ, మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన వసతి, ఆధునిక మౌలిక సదుపాయాలు, మెరుగైన బోధనా వాతావరణా న్ని అందిస్తోందని తెలిపారు. ఇలాంటి విద్యాసంస్థల ద్వారా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించే అవకాశాలు మరింత మెరుగు పడతాయని అన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మంత్రులు మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలను నాటి సంరక్షిం చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ జి. నగే ష్, శాసనసభ్యుడు పాయల్ శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, జిల్లా కలెక్ట ర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఆర్. ఎస్. చిత్రు, ప్రజాప్రతి నిధులు, అధికారులు, ఉపాధ్యా యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జూలై 5లోగా దరఖాస్తు చేసుకోండి

రైతు భరోసా కింద ఎకరానికి రూ.6,000 ఆర్థిక సాయం పొందండి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 27, (ప్రజా జ్యోతి)రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రైతు భరోసా పథకం కింద వానాకాలం సీజ న్‌కు సంబంధించిన ఆర్థిక సహాయాన్ని జూలై 30న విడుదల చేయనున్న నేపథ్యంలో, అర్హులైన కొత్త పట్టాదారులం దరూ తప్పనిసరిగా జూలై 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకో వాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా శనివారం ఒక ప్రకటన లో కోరారు.జూన్ 15, 2026 నాటికి కొత్తగా వ్యవసాయ భూ ములు కొనుగోలు చేసి పట్టా దారు పాస్‌పుస్తకం (పిపిబి) పొందిన రైతులు రైతు భరోసా పథకానికి అర్హులని తెలిపారు. అర్హులైన రైతులు తమ గ్రామానికి సంబంధించిన వ్య వసాయ విస్తరణ అధికారి (ఏఈఓ), లేదా సంబంధిత మండల వ్యవ సాయ అధికారి (ఎం ఏఓ) కార్యాలయంలో దరఖాస్తు సమర్పిం చాలనిసూ చించారు. దరఖాస్తుతో పాటు పట్టాదారు పాస్ పుస్తకం (పిపి బి), ఆధార్ కార్డు, ఆధార్ తో అనుసంధానమైన బ్యాంకు పాస్‌బుక్, మొబైల్ నంబర్ సమర్పించాలని తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకం అందుబాటులో లేకపోతే ఆన్‌లైన్ 1-బి (1బీ) ప్రతిని జతచేయవ చ్చని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి కొత్త పట్టాదారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గడువు లోగా దరఖాస్తు చేసుకుంటే, వానాకాలం రైతు భరోసా కింద ఎకరానికి రూ.6,000 చొప్పున ఆర్థిక సాయం పొందే అవకాశం ఉంటుందని కలెక్టర్ ఆప్రకట నలో పేర్కొన్నారు.

## రాష్ట్రంలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని సమర్థవం తంగా అమలు చేస్తున్నాం

అంబేద్కర్ కాలనీలో నూతన ఇందిరమ్మ గృహాలను ప్రారం భించిన రాష్ట్ర మంత్రులు



ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 27,( ప్రజా జ్యోతి) తెలంగాణ రాష్ట్రంలో ఇందిర మ్మ గృహ నిర్మాణ పథకాన్ని సమర్థవంతంగా అమలు చే స్తున్నామని తెలంగాణ రాష్ట్ర మంత్రులు స్పష్టం చేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని అంబేద్కర్ కాలనీ (వార్డు నం. 31)లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన నూతన గృహాలను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాం స్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృ ష్ణారావు, రాష్ట్ర మైనారిటీ సం క్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ శనివారం ప్రారంభించా రు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి పొందిన అస్మా బేగంల నూతన గృహం ను మంత్రులు ప్రారంభించి, ఇంటి ని పరిశీలించారు. అనంతరం లబ్ధిదారుని అభినందించి, వ స్త్రాలు అందజేసి సన్మానించా రు.ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాలకు శా శ్వత నివాస సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలి పారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన సొంత ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# సోనాలా మండలానికి అదనపు ఏఈఓ లను వెంటనే కేటాయించాలి

## సోనాలా మండల రైతుల విజ్ఞప్తి




సోనాల, జూన్ 27 ( ప్రజాజ్యోతి ):సోనాల మండల కేంద్రంలోని రైతులు తమ ఆవేదనను వ్యక్తపరుస్తూ, నూతనంగా ఏర్పడిన సోనాల మండలంలో దాదాపు 15,000 ఎకరాల వ్యవసాయ భూమి సాగులో ఉండి, మండల పరిధిలో పత్తి, సోయాబీన్, మొక్కజొన్న, జొన్న,కంది తదితర పంటలను వేలాది మంది రైతులు సాగు చేస్తున్నారని, ఇంత విస్తారమైన వ్యవసాయ భూమి, అధిక సంఖ్యలో రైతులు ఉన్నప్పటికీ ప్రస్తుతం మొత్తం మండలానికి ఒక్క వ్యవసాయ విస్తరణ అధికారి మాత్రమే విధులు నిర్వహించడం తీవ్ర ఇబ్బందులకు దారితీస్తోందని తెలిపారు.ఒక్క అధికారి అన్ని గ్రామాలను సందర్శించడం, రైతులకు పంటలపై సాంకేతిక సూచనలు అందించడం, పంటల నమోదు, ఈ-క్రాప్, ప్రభుత్వ వ్యవసాయ పథకాల అమలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వినియోగంపై అవగాహన కల్పించడం, పంటల వ్యాధులను గుర్తించి తక్షణ సలహాలు ఇవ్వడం వంటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడం సాధ్యం కావడం లేదని. దీనివల్ల రైతులు అనేక సందర్భాల్లో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వ్యవసాయ శాఖ నిబంధనల ప్రకారం ఇంత పెద్ద భూ విస్తీర్ణానికి ఒకరి కంటే ఎక్కువ మంది వ్యవసాయ విస్తరణ అధికారులు ఉండాల్సిన అవసరం ఉందని, కానీ సోనాలా మండలంలో మాత్రం ఒక్కరితోనే వ్యవస్థ కొనసాగుతుండటం దారుణంగాఉందన్నారు. ముఖ్యంగా ఖరీఫ్, రబీ సీజన్లలో పనిభారం మరింత పెరిగి రైతులకు సేవలు ఆలస్యమవుతున్నాయని.అందువల్ల రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సోనాలా మండలానికి వెంటనే మరో ఇద్దరు వ్యవసాయ విస్తరణ అధికారులను కేటాయించి, మొత్తం మూడు క్లస్టర్లుగా విభజించి వ్యవసాయ సేవలను మరింత సమర్థవంతంగా అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం మరియు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులను మండల రైతులు కోరడం జరిగింది.

# సోనాల మండలానికి నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం హర్షణీయం

## -- తుల అరుణ్ కుమార్

సోనాల, జూన్ 27 ( ప్రజాజ్యోతి ):తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని అద్దె భవనాలు మరియు శిథిలావస్థలో ఉన్న రెవెన్యూ కార్యాలయాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 10 రెవెన్యూ డివిజనల్ (ఆర్ డి ఓ) కార్యాలయాలు మరియు 107 తహసీల్దార్ కార్యాలయాలకు నూతన కార్యాలయ భవనాల నిర్మాణం కోసం రూ.263.25 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ప్రభుత్వం జి.ఓ.ఆర్.టి. నెం.375, తేదీ 25-06-2026ను విడుదల చేయడం ఎంతో అభినందనీయమని కాంగ్రెస్ నాయకుడు తుల అరుణ్ కుమార్ పేర్కొన్నారు.ఈ జాబితాలో కొత్తగా ఏర్పాటైన సోనాల మండల తహసీల్దార్ కార్యాలయం కూడా చోటు దక్కడం సోనాల మండల ప్రజలకు ఎంతో సంతోషకరమైన విషయం అన్నారు. ఇప్పటివరకు అద్దె భవనంలో కొనసాగుతున్న కార్యాలయానికి శాశ్వత భవనం నిర్మాణం జరగడం వల్ల ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన మరియు వేగవంతమైన రెవెన్యూ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.సోనాల మండల అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని, ప్రభుత్వ పరిపాలనా సేవలను గ్రామీణ ప్రాంతాలకు మరింత సమర్థవంతంగా అందించే దిశగా ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తూ సోనాల మండలానికి కూడా నిధులు మంజూరు చేసిన గౌరవ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు మరియు రెవెన్యూ శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో సహకరించిన ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ డిసిసి అధ్యక్షులు శ్రీ నరేష్ జాధవ్ కు, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ శ్రీ ఆడే గజేందర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.రాబోయే రోజుల్లో కూడా సోనాల మండల సమగ్ర అభివృద్ధి, ప్రభుత్వ కార్యాలయాల బలోపేతం, విద్య, వైద్యం, రహదారులు, సాగునీరు వంటి ప్రజా అవసరాల సాధన కోసం నిరంతరం కృషి కొనసాగిస్తామని తుల అరుణ్ కుమార్ స్పష్టం చేశారు.



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

Revenue (DA. CMRF) Department – Construction of new office buildings of RDO offices (10) and Tahsildar Offices (107) which are located in rented/ dilapidated condition buildings – Administrative sanction for an amount of Rs.263.25 Crores – Orders – Issued.

REVENUE (DA. CMRF) DEPARTMENT

G.O.Rt.No.375 Dated:25.06.2026

Read the following:-

1.From the CCLA., TG, Hyderabad, Lr.No.Budget/ 3507093/ 2026, dated 21.01.2026.
2.From the CCLA., TG, Hyderabad, Lr.No.Budget /3507093/ 2026, dated 10.03.2026

****

ORDER:

In the circumstances reported by the Chief Commissioner of Land Administration, Telangana, Hyderabad in the references read above, Government hereby accord administrative sanction for an amount of Rs.263.25 Crores (Rupees Two Hundred and Sixty Three Crores and Twenty five Lakhs only) for Construction of new office buildings of RDO offices (10) and Tahsildar Offices (107) (List Enclosed), which are located in rented/ dilapidated condition buildings in Telangana State, at the rate of Rs.2.25 Crores (Rupees Two Crores Twenty Five Lakhs only), per each building under Head of Account 4070-800-25(08) Construction of Revenue Buildings – 530/531. The work is entrusted to Telangana Housing Corporation Limited, Hyderabad.

2. The Chief Commissioner of Land Administration, Telangana, Hyderabad is requested to take necessary action in the matter.

3. This order issues with the concurrence of Finance (EBS.VII) Department, vide their U.O.No.474/110/A1/EBS.VII/2026, dated 23.04.2026.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

LOKESH KUMAR D.S.
SECRETARY TO GOVERNMENT

To
The Chief Commissioner of Land Administration, Telangana,Hyderabad
The Telangana Housing Corporation Ltd., Hyd.
Copy to:
The Finance (EBS.VII) Department.
SC / SF

// Forwarded by order //

SECTION OFFICER

# ఉట్నూర్ లో కోటి రూపాయలతో లైబ్రరీ నిర్మాణానికి ఇంచార్జ్ మంత్రి తో కలిసి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్





**విద్య జ్యోతి ద్వారా ఏజెన్సీ విద్యార్థులకు గిరిజన సంక్షేమ శాఖ అండగా నిలుస్తుంది వెడ్మ బొజ్జు పటేల్**

**ఖానాపూర్ జూన్ 27 (ప్రజా జ్యోతి )** ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్ మండలం కేబీ కాంప్లెక్స్ లో లైబ్రరీ నిర్మాణానికి ఇంచార్జి మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు మరియు పార్లమెంట్ సభ్యులు గెడం నగేష్ తో కలిసి భూమి చేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పనులు ప్రారంభించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో అధునాతన నిర్మాణానికి ఆలోచన చేస్తున్నాం అని 1 కోటి రూపాయలతో కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఈ లైబ్రరీ కి ఎమ్మెల్యే నిధుల నుండి 2 కోట్లు మంజూరు చేస్తా అని ఇంచార్జి మంత్రి లైబ్రరీ నిర్మాణానికి మరో 2 కోట్ల కేటాయించి మొత్తం 5 కోట్లతో ఏజెన్సీ ప్రాంతంలో అధునాతన లైబ్రరీ నిర్మిస్తే,ఆదివాసీ గిరిజన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది అని ఎమ్మెల్యే అన్నారు.అనంతరం కేబీ కాంప్లెక్స్ పీఎంఆర్సీ భవనలంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్య జ్యోతి కార్యక్రమంలో మంత్రివర్యులు,ఎంపీ తో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జు ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య జ్యోతి ద్వారా ఐటీడీఏ పరిధిలోని పాఠశాల విద్యార్థులకు అనేక రకాలుగా ఉపయోగపడేందుకు ఐటిడిఎ పీవో కృషి చేస్తున్నారని.పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ కాంపిటేటివ్ పరీక్షలకు కోచింగ్ కి పంపిస్తున్నాం అని,ఏజెన్సీ ప్రాంతంలోని విద్యార్థులకు అండగా నిలిచేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని అన్నారు.విద్య జ్యోతి లో ఒక్కో విభాగాన్ని విభజించి వారికి ప్రత్యేక అధికారులను నియమించడం జరిగింది,ఉపాధ్యాయులు కూడా ఐటీడీఏ అధికారులు చేస్తున్న ప్రయత్నానికి సహకరించి విద్యార్థుల్లో కొత్త నైపుణ్యాన్ని పెంపొందించడానికి కృషి చేయాలని అన్నారు.ఆర్టిఫిసియల్ ఇంటిలిజెన్ ద్వారా గోండు భాషను ట్రాన్స్ లెట్ చేస్తూ విద్యార్థులకు తెలుగు మరియు ఇతర భాషల నేర్చుకోవడానికి కృషి చేస్తున్నాం అన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు ఉపాధ్యాయులు,స్థానికులు,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్‌తో కేంద్రంలోని బి జెపి ప్రభుత్వం ఓట్ల చోరీ జరుపుతోంది







## బి ఎల్ ఏ 2లు మరీ జాగ్రత్తగా ఉండాలి

## మాజీ ఎంపీ సోయం బాపూ రావు

**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 27, (ప్రజా జ్యోతి)** ఎస్ ఐ ఆర్ తో బిజెపి కేంద్ర ప్రభుత్వం ఓట్ల చోరీకి పాల్ప డుతోందని దీనిపట్ల బిఎల్ఎ 2 లు మరీ జాగ్రత్తగా వివాహ రించాలని ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాపూరావు అ న్నారు.ఆదిలాబాద్ జిల్లా కేం ద్రంలోని తనీషా గార్డెన్ లో ని ర్వహించిన ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బిఎల్ ఎ- 2 ల సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణా రావు తో పాటు మాజీ ఎంపీ సోయం బాపూ రావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, డిసిసి అ ధ్యక్షులు నరేష్ జాదవ్ లు ఆదిలాబాద్, బోథ్ నియోజక వర్గ ఇంచార్జిలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సోయం బా పూ రావు మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ తో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరుతో విపక్ష పార్టీల ఓట్లు ప్రమాదంలో పడ్డాయని, భారీగా ఓట్ల చోరీ జరుగుతోం దని మాజీ ఎంపీ సోయం బా పూరావు అన్నారు. స్థానిక ఎమ్మెల్లే పాయల్ శంకర్ తో పాటు బోథ్ ఎమ్మెల్లే అనిల్ జాదవ్ లు అన్ని తామే అభి వృద్ధి కార్యక్రమాలు చేస్తున్నా మని ప్రజలకు అబద్ధపు మా టలు చెప్పుకుంటున్నారన్నా రు. ఇద్దరు చేసింది ఏమి లేద న్నారు. బీజేపీ ఈ సీ ఐ ను అడ్డుపెట్టుకుని ఒక పథకం ప్రకారం బీజేపీ పార్టీ వ్యతిరేక ఓట్లు తొలగిస్తుందన్నారు. ఈ సీఐ నియామక ప్రక్రియలో మన జాగ్రత్తలో మనముండాలని మన ఓటును కోల్పోకుండా మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. పార్టీ పటిష్టతలో పార్టీ ఓట్లు గల్లంతు కాకుండా కాపాడ టంలో బీఎల్ఏ -2 ల పాత్ర చాలా కీలకమన్నారు. పని చే సిన ప్రతి ఒక్కరికీ పార్టీ పదవు ల్లోనూ, నామినేటెడ్ పోస్టుల్లో నూ తగిన ప్రాధాన్యత కల్పి స్తామని హామీ ఇచ్చారు.

## తాటిగూడలో నూతన ఇందిర మ్మ గృహాలను ప్రారంభించిన రాష్ట్ర మంత్రులు



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 27, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ పట్టణంలోని 23 వవార్డు తాటిగూడలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులు డోమటి లావణ్య, వాంఖ డే తానుబాయి మాధవ్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న గృహాలను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్ చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ శనివారం ప్రారం భించారు. ఈ సందర్భంగా మంత్రులు నూతన గృహాలను పరిశీలించి, లబ్ధి దారులను అభినందించారు. వారికి వస్త్రాలు అందజేసి సన్మా నించి శుభా కాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్ర భుత్వం అమలు చేస్తు న్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించడం ద్వారా వారి జీవన ప్ర మాణాలను మెరుగు పరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొ న్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఆర్. ఎ స్. చిత్రు, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, కాలనీ వా సులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ గా ఎం అశోక్



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 27, (ప్రజా జ్యోతి)**నూతన జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్‌గా ఎమ్. అశోక్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషాను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ శుభా కాంక్షలు తెలుపుతూ, శాఖ కార్యకలాపాలను పారదర్శ కతతో, సమర్థవంతంగా వి ధులను నిర్వహించాలని సూ చించారు.